సాక్షి ఏలూరు

గురువారం । 26 । అక్టోబర్ । 2023



మావుళ్లమ్మకు పూజలు

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మను ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ శ్రీధర్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. వీరికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.



ఆరోగ్య సురక్షకు.. 'ప్రత్యేక'ం

ప్రతి పల్లెలో, వార్డులో ప్రభుత్వం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తోంది. ప్రత్యేక వైద్య నిపుణులతో మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారు. 8లో ▸



రూ.1.11 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు భీమడోలు మండలం పోలసానిపల్లికి చెందిన బీఎస్ మార్ట్ యాజమాన్యం బుధవారం రూ.1,11,111 విరాళంగా అందజేసింది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలి



సత్రంపాడు పాఠశాలలో నాడు - నేడు పనుల పరిశీలన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసినప్పుడే పాఠశాల అభివృద్ధి సాధిస్తుందని ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శ్యామ్ సుందర్ అన్నారు. స్థానిక సత్రంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఉదయం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రక్తహీనత గల విద్యార్థులకు ఐరన్ టాబ్లెట్స్ పంపిణీ గురించి వివరాలు తెలుసుకున్నారు. మనబడి నాడు నేడు కార్యక్రమంలో అదనపు తరగతి గదులు నిర్మాణపు పనులు పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతిరోజు సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల ద్వారా గ్రేడు విద్యార్థులు బాగా చదవాలని తద్వారా మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. నవంబర్‌లో జరుగబోయే సమ్మేటివ్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

మహిళా కార్యవర్గం ఏర్పాటు

ఏలూరు(మెట్రో): ఏపీ జేఏసీ అమరావతి ఏలూరు జిల్లా మహిళా విభాగం కార్యవర్గాన్ని ఏలూరు రెవెన్యూ భవనంలో జిల్లా ఏపీ జేఏసీ అమరావతి యూనిట్ చైర్మన్ రమేష్ కుమార్, జనరల్ సెక్రటరీ రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ ఏపీ జేఏసీ అమరావతి ఎల్లప్పుడూ మహిళా ఉద్యోగులకు అండగా ఉంటుందన్నారు. ముఖ్య అతిథి రాష్ట్ర అసోసియేట్ టి.వి.ఫణి పేర్రాజు మాట్లాడుతూ బొప్పరాజు సంకల్పం, మహిళా విభాగం ఆవశ్యత గురించి తెలియజేశారు. సమావేశంలో జిల్లాకే చెందిన ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర సెక్రటరీ జ్యోతి ఎన్నికై న జిల్లా మహిళా విభాగం కార్యవర్గాన్ని ఆహ్వానించారు. కార్యవర్గ సభ్యులకు మహిళా విభాగం రాష్ట్ర చైర్‌పర్సన్ పి.లక్ష్మి, జనరల్ సెక్రటరీ విజయలక్ష్మి, కో-చైర్‌పర్సన్ సాయి లక్ష్మి, సెక్రటరీ కోటేశ్వరీ సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ప్రమాణ స్వీకారం చేయించారు.

27న కలిదిండిలో జగనన్నకు చెబుదాం

ఏలూరు(మెట్రో): కలిదిండి మండలంలో ఈ నెల 27న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. భీమవరం రోడ్డు లోని కల్యాణి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు.

రేపు వైఎస్సార్‌సీపీ కార్యవర్గ సమావేశం

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం ఈనెల 27న ఏలూరులో నిర్వహిస్తున్నామని జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని చెప్పారు. ఏలూరు శనివారపుపేట సారథి కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు ఎంపీ మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్‌చంద్రబోస్ హాజరవుతారని తెలిపారు. ఏలూరు ఎంపీ, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు హాజరవుతారని తెలిపారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కమిటీ సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా అనుబంధ విభాగాల ప్రెసిడెంట్లు, జేసీఎస్ కన్వీనర్లు, టీటీడీ బోర్డు మెంబర్లు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, జిల్లా కార్పొరేషన్ చైర్మన్లు, ఏఎంసీ చైర్మన్లు, నియోజకవర్గ స్థాయి పరిశీలకులు, జోనల్ ఇన్‌చార్జ్‌లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

27న నరసాపురంలో వైఎస్సార్‌సీపీ బస్సు యాత్ర

నరసాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సామాజిక బస్సు యాత్ర నరసాపురం నియోజకవర్గంలో ఈ నెల 27న నిర్వహిస్తోన్నట్టు ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు చెప్పారు. బుధవారం పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బస్సుయాత్ర వివరాలు వెల్లడించారు. గోదావరి జిల్లాలకు సంబంధించి మొదటిగా నరసాపురంలోనే బస్సు యాత్ర ప్రారంభమవుతోందని ముదునూరి వివరించారు. 27న మధ్యాహ్నం మొగల్తూరులో బస్సు యాత్ర ప్రారంభమవుతుందని ప్రసాదరాజు చెప్పారు.

జెడ్పీ నిధులతో అభివృద్ధి పనులు

- రహదారుల నిర్మాణానికి పెద్దపీట
- ఇప్పటికే రూ.16 కోట్లతో ప్రణాళిక
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాధాన్యత క్రమంలో పనులు



జెడ్పీ నిధులతో శంకుస్థాపనలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎంపీ కోటగిరి శ్రీధర్

ఏలూరు (మెట్రో): జిల్లా పరిషత్ నిధులతో అభివృద్ధి పనులకు ఉమ్మడి జిల్లాలో శ్రీకారం చుట్టారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 48 మండలాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. ఆర్థిక సంఘ నిధులు, జిల్లా పరిషత్ సాధారణ నిధుల ద్వారా మండలాల వారీగా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. గతంలో దిశా నిర్దేశం లేకుండా చేపట్టిన పనులకు స్వస్తి చెప్పి ప్రస్తుతం ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టేందుకు నిర్ణయించి ఆ మేరకు విధి విధానాలు ఖరారు చేశారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధిని గుర్తించి ప్రధానమైన తాగునీరు, డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణాలపై దృష్టి కేంద్రీకరించారు. దీనిలో భాగంగా 48 మండలాల్లో ప్రాధాన్యత క్రమంలో పనులను గుర్తించి ఆయా పనులకు నిధులు కేటాయింపులు చేస్తున్నారు.

రోడ్లు, డ్రెయినేజీలకు ప్రాధాన్యం : ప్రస్తుతం రూ.16 కోట్లతో పలు అభివృద్ధి పనులకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఇప్పటికే రూ.60 లక్షల నిధులతో పెనుమంట్ర మండలం ఆలమూరులో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, పోలవరం నియోజకవర్గంలో సుమారు రూ.కోటి వ్యయంతో సత్యసాయి మంచినీటి పథకం అభివృద్ధి, దేవరపల్లి మండలం త్యాజంపూడి మరికొన్ని గ్రామాల్లో రూ.కోటి నిధులతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, పెదపాడు మండలం సత్యవోలులో డ్రెయిన్ల అభివృద్ధి, ఇలా ప్రజలకు అవసరమైన అభివృద్ధిని గుర్తించి ఆయా అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. నిధుల లభ్యత ఆధారంగా ప్రతి మండలంలోనూ అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మరికొన్ని నిధులను మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. భవిష్యత్‌లో జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో మరిన్ని పనులు చేపడుతూ జగనన్న సంక్షేమ పాలన అందించేందుకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నారు.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు



ప్రాధాన్యత క్రమంలో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తూ జిల్లాను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాము. జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఇప్పటికే రూ.16 కోట్లతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 48 మండలాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నాము. ప్రజలకు అత్యావసరమైన తాగునీరు, డ్రెయిన్లు, రోడ్లు వంటి వాటిపై దృష్టి కేంద్రీకరించి పనులు చేపడుతున్నాం.

– ఘంటా పద్మశ్రీ, జెడ్పీ చైర్‌పర్సన్

ఆక్వా సదస్సుకు ఆహ్వానం



ఎంపీ మిథున్ రెడ్డిని ఆహ్వానిస్తున్న దృశ్యం

కాళ్ల: వచ్చే నెల రెండో తేదీ నుంచి మూడురోజుల పాటు కాళ్ల మండలం పెద అమిరంలో ఆక్వా ఎక్స్ ఇండియా ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు ఆక్వా ఎక్స్ సీఈవో దంతులూరి వేణు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు బుధవారం తెలిపారు. నవంబర్ 2, 3, 4 తేదీల్లో మూడు రోజులపాటు రాధాకృష్ణ కన్వెన్షన్ సెంటర్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఎంపీ, వైఎస్సార్‌సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని ఆహ్వానించినట్లు తెలిపారు. 100 స్టాళ్లకు పైగా ప్రదర్శన నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారి వెంట టీటీడీ బోర్డు మెంబర్ గాదిరాజు సుబ్బరాజు ఉన్నారు.

అలసత్వం సహించేది లేదు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ హెచ్చరిక



ఏలూరు(మెట్రో): ప్రాధాన్యతా భవనాల నిర్మాణల విషయంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని సంబంధిత అధికారులకు కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ హెచ్చరించారు. స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం రీ సర్వే, స్వమిత్వా సర్వే, ప్రాధాన్యతా భవనాల నిర్మాణ ప్రగతి, నాడు-నేడు, గృహనిర్మాణం, గడపగడపకు మన ప్రభుత్వం, వైద్యం, ఆరోగ్యం, తదితర కార్యక్రమాల అమలును సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే సెంటర్లు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలకు సంబంధించి కొన్ని ప్రాంతాలలో ప్రగతి తక్కువగా కనిపిస్తుందన్నారు. ప్రాధాన్యతా భవనాల నిర్మాణ పనులను నవంబర్ నెలాఖరులోగా పూర్తయ్యేలా అధికారులు చూడాలన్నారు. లేని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలకు వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. పంచాయతీ శాఖాధికారులు కార్యాలయాల్లో కూర్చొని, కింద స్థాయి సిబ్బందిపై బాధ్యతను వదలకుండా క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలలో ప్రగతి కనిపించకపోతే ప్రభుత్వానికి సరెండర్ చేస్తానని అందుకు సిద్ధంగా ఉండాలని పంచాయతీ రాజ్ ఈఈలు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ రమాదేవిని కలెక్టర్ హెచ్చరించారు. రీ సర్వే పనులపై సమీక్షిస్తూ జిల్లాలో నిర్దేశించిన సమయంలోగా రీ సర్వే పనులు పూర్తి చేయాలని, స్టోన్ ప్లాంటింగ్ కూడా చేయించాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణ పనులపై సమీక్షిస్తూ ప్రస్తుతం నిర్మాణ పనులకు అనుకూలంగా ఉన్నందున ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖపై సమీక్షిస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలను వై.ఎస్.ఆర్. ఆరోగ్యశ్రీ పథకంలో నమోదు చేయాలన్నారు. బుట్టాయిగూడెం, నూజివీడులలో ప్రభుత్వ ఆసుపత్రుల సూపెరింటెండెంట్లు ప్రసవాలను ఆరోగ్యశ్రీ పథకంలో నమోదు చేయడం లేదని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సదరు అంశంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖాధికారిని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూర్య తేజ, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, జిల్లా రెవిన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు



వైఎస్సార్‌సీపీలోకి చేరిన నాయకులతో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం: చింతలపూడి నియోజకవర్గం లింగపాలెం మండలానికి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ములగలంపాడుకు చెందిన టీడీపీ నేతలు వినుగంటి సీతారామస్వామి (రఘుబాబు), ఆయన తనయులు ఆదిత్య, అన్వేష్, మరో 100 మంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. సీఎం జగనన్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు రఘుబాబు ప్రకటించారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా రఘుబాబుకు వైఎస్సార్‌సీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రఘుబాబు, ఆయన కుటుంబం, అనుచరగణం వైఎస్సార్‌సీపీలో చేరడంతో పార్టీకి మరింత బలం చేకూరుతుందని ఎమ్మెల్యే ఎలీజా పేర్కొన్నారు. పార్టీలో బాధ్యత తీసుకుని రఘుబాబు ప్రజా సేవలో మమేకం కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. తామంతా కలిసి పార్టీని బలోపేతం చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని, పార్టీ బలోపేతానికి కృషిచేస్తామని రఘుబాబు ప్రకటించారు. కార్యక్రమంలో చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మందలపు సాయిబాబ, ముసునూరు వెంకటేశ్వరరావు, లోక్‌నాథ్‌రెడ్డి, కొండయ్య, లింగపాలెం మండల నాయకులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో హరికృష్ణ, ఎం.భాగ్యరాజు, ఎం.రాముడు, స్వామి, సీహెచ్ సూరిబాబు, నవీన్, నాగరాజు, పవన్, అజయ్, ప్రభు, అనిల్, హరిబాబు తదితరులు ఉన్నారు.

నరసాపురం ఆర్డీఓగా అత్యుత్ అంబరీష్ బాధ్యతలు

నరసాపురం: నరసాపురం ఆర్డీఓగా డాక్టర్ ఎం.అత్యుత్ అంబరీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్టణానికి చెందిన ఆయన 2022 బ్యాచ్ గ్రూప్-1 ద్వారా రెవిన్యూ శాఖలో ప్రవేశించారు. శ్రీకాకుళం కలెక్టరేట్‌లో డిప్యూటీ ట్రైనీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను నరసాపురం ఆర్డీవోగా ప్రభుత్వం నియమించింది. కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్న ఆయన కొంతకాలం పాడేరులో వైద్యశాఖలో సివిల్ సర్జన్‌గా కూడా పనిచేశారు. ఇక్కడ సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.సూర్యతేజను కేఆర్ పురం ఐటీడీఏ పీవోగా బదిలీ చేశారు. అప్పటి నుంచి పూర్తిస్థాయి అధికారి నియామకం పెండింగ్‌లో ఉంది. ఈ సందర్భంగా అంబరీష్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు.

ఆర్డీఓ శ్రీనివాసులు రాజు బాధ్యతల స్వీకరణ

సాక్షి, భీమవరం: భీమవరం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్(ఆర్డీఓ)గా కె.శ్రీనివాసులురాజు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించా రు. శ్రీనివాసులురాజు గ్రూప్ వన్‌లో ఎంపికై శిక్షణ అనంతరం మొట్ట మొదటిసారిగా భీమవరం ఆర్డీఓగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు పనిచేసిన దాసి రాజు కృష్ణా జిల్లా ఉయ్యూరు ఆర్డీఓగా బదిలీ అయ్యారు.

బీచ్ ఫెస్టివల్‌కు ప్రణాళిక రూపొందించండి

భీమవరం (ప్రకాశంచౌక్): పేరుపాలెం బీచ్ ఫెస్టివల్‌కు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో టూరిజం, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశమై పేరుపాలెం బీచ్ ఫెస్టివల్ నిర్వహణపై సమీక్షించారు. 2024 జనవరి మూడవ వారంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు తేదీలు ఖరారు చేయాలని తెలిపారు. ఫుడ్ స్టాల్స్, డ్వాక్రా, లేసు ఉత్పత్తులు, బీచ్ గేమ్స్, గాలిపటాల పోటీలు, ఫైర్ వర్క్స్, సంగీత విభావరి, తదితర ఈవెంట్స్ నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించాలన్నారు. సమావేశంలో నరసాపురం ఆర్డీఓ డాక్టర్ ఎం.అచ్యుత అంబరీష్, టూరిజం రీజనల్ డైరెక్టర్ వి.స్వామి నాయుడు, టూరిజం డీఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బేటీ బచావో బేటీ పడావో : బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం శాఖల అధికారులతో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నినాదాలకే పరిమితం కాకుండా విస్తతంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. లింగ వివక్షను ప్రజల మనసుల నుంచి దూరం చేయాలన్నారు. ప్రతి నెల ఆడపిల్లలకు రక్త పరీక్షలు నిర్వహించి ప్రోగ్రెస్ కార్డు లాగా అందజేయాలన్నారు. బాల్య వివాహాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ పెద్ద ఎత్తున కొనసాగించాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా ఆర్బీకేలు

ఏలూరు(మెట్రో): ఖరీఫ్‌లో ఏలూరు జిల్లాలో సుమారుగా 5.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రావొచ్చని అంచనా వేశామని జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు. మొత్తం 261 రైతు భరోసా కేంద్రాల్ని గుర్తించి ధాన్యం కొనుగోలుకు సిద్ధం చేశామన్నారు. ధాన్యం కొనుగోలుకు సిబ్బందిని నియమించామన్నారు. సిబ్బంది కొరత ఉంటే సంబంధిత కొనుగోలు సహాయక కేంద్రాల వారినే ధాన్యం సేకరణకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరామన్నారు. పంట కోతలు మొదలై ధాన్యం విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న చోట, కొనుగోలు కేంద్రాల గురించి స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలని.. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు లోబడి ఉంటే ధాన్యం కొనుగోలుకు అవసరమైన గోనె సంచులు, జీపీఎస్ అమర్చిన రవాణా వాహనాలు సమకూరుస్తారన్నారు. సేకరించిన ధాన్యానికి సొమ్ము 21 రోజులలోపు ఆధార్ అనుసంధానిత బ్యాంక్ ఖాతాకు జమచేస్తామన్నారు. రైతులందరూ ఈ నెల 26 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నాణ్యతా ప్రమాణాల మేరకు ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు విక్రయించుకోవాలన్నారు.

26 నుంచి ఈ క్రాప్ ముసాయిదా జాబితా

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో ఖరీఫ్ 2023 సీజన్‌లో 4,83,899 ఎకరాల్లో పంటల సాగు, ఈ క్రాప్ పూర్తి చేశామని జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ నెల 26 నుంచి 29 వరకు ఈ క్రాప్ ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తామన్నారు. ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరాలు ఉంటే సవరణ కోసం ఆర్‌బీకేల్లో అభ్యంతరాలు రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

- చరాచర సృష్టికి ఆహ్వానం
- వెండి శేషవాహనంపై శ్రీవారి తిరువీధి సేవ
- నేటి రాత్రి కల్యాణోత్సవం



వెండి శేష వాహనంపై శ్రీవారు



ధ్వజ పటానికి హారతులిస్తున్న అర్చకులు



కల్యాణ వేదికను నిర్మిస్తున్న సిబ్బంది



ద్వారకా కృష్ణ అలంకారంలో శ్రీవారు

ద్వారకాతిరుమల: చిన్నతిరుపతి క్షేత్రంలో జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు చరాచర సృష్టిని ఆహ్వానిస్తూ.. బుధవారం రాత్రి నిర్వహించిన ధ్వజారోహణ వేడుక భక్తకోటికి నేత్రపర్వమైంది. వైఖానస ఆగమోక్తంగా ఇంద్రాది అష్ట దిక్పాలకులను, భేరీ దేవతలను, గంధర్వ, కిన్నెర, కింపురుషాది దేవగణాలను, సప్త అధోలోక జీవులను స్వాగతిస్తూ.. లాంఛనంగా వేద మంత్రోచ్చరణలతో ఆలయ ధ్వజస్తంభంపై అర్చకులు గరుడ పటాన్ని ఎగురవేశారు. అంతక ముందు రుత్విగ్వరణ, మృద్గ్రహణ నిర్వహించిన అర్చకులు పుట్టమన్నును, నవధాన్యాలను తెచ్చి ఆలయ యాగశాలలో ఏర్పాటు చేసిన పాలికల్లో శాస్త్రోక్తంగా పోసి అంకురార్పణ జరిపారు. అనంతరం చినవెంకన్న బ్రహ్మోత్సవాల వీక్షణకు సర్వదేవతలను ఆహ్వానించే దిశగా ధ్వజారోహణ నిర్వహించారు. అనంతరం గరుఢ ప్రసాదాన్ని భక్తులకు, సంతానం లేని మహిళలకు అందించారు. ఆ తరువాత వెండి శేష వాహనంపై స్వామివారి తిరువీధి సేవ నేత్రపర్వంగా జరిగింది. ఆలయ ముఖ మండపంలో స్వామివారు ద్వారకా కృష్ణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీహరి కళాతోరణ వేదికపై జరిగిన పలు సాంస్కృతి కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

బ్రహ్మోత్సవాల్లో నేడు :

- ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై తిరువీధి సేవ
- సాయంత్రం 5 గంటల నుంచి ఎదుర్కోలు ఉత్సవం
- రాత్రి 8 గంటల నుంచి శ్రీ స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం
- అనంతరం వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం
- ఉదయం 8.30 నుంచి రాత్రి 9 గంటల వరకు వేద పారాయణలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- శ్రీవారి ప్రత్యేక అలంకారం : మోహిని


శ్రీవారి తిరుకల్యాణానికి సర్వం సిద్ధం

శ్రీవారి కల్యాణ మహోత్సవానికి క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలో స్వామివారి కల్యాణ వేదిక నిర్మాణ పనులు బుధవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ పనులు గురువారం సాయంత్రం నాటికి పూర్తవుతాయని ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఆలయ పరిసరాలతో పాటు, కల్యాణ వేదిక ప్రాంతాన్ని పచ్చిపూలతో అలంకరిస్తున్నారు. కల్యాణ వేడుక అనంతరం స్వామివారి తిరువీధి సేవకు వినియోగించే వెండి గరుఢ వాహనాన్ని ఇప్పటికే ముస్తాబు చేశారు. రాత్రి 8 గంటల నుంచి ప్రారంభమయ్యే స్వామి, అమ్మవార్ల కల్యాణ వేడుకలో పలువురు ప్రజాప్రతినిధులు, న్యాయమూర్తులు, జిల్లా అధికారులు పాల్గొంటారని ఈఓ తెలిపారు.

28న శ్రీవారి ఆలయం మూసివేత

ద్వారకాతిరుమల: పాక్షిక చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని ఈనెల 28న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి శ్రీవారి ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేయనున్నట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. మరుసటి రోజు 29న తెల్లవారుజామున 4 గంటలకు యథావిధిగా ఆలయ ద్వారాలను తెరచి సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమాలను అర్చకులు జరుపుతారన్నారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శన భాగ్యాన్ని కల్పిస్తామన్నారు.

జెడ్పీ సీఈఓగా సత్యనారాయణ



ఎస్‌వీవీ సత్యనారాయణ, జిల్లా పరిషత్ సీఈఓ

ఏలూరు(మెట్రో): జిల్లా పరిషత్ నూతన సీఈఓగా ఎస్‌వీవీ సత్యనారాయణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌వీవీ సత్యనారాయణ ప్రస్తుతం కాకినాడ ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఆయన జిల్లాలో జంగారెడ్డిగూడెం ఆర్డీఓగా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా విధులు నిర్వహించారు. రెండు మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఆరోగ్య సురక్షకు.. 'ప్రత్యేక'ం



భీమవరం శిబిరంలో ఓ బిడ్డను పరీక్షిస్తున్న వైద్యురాలు



మహదేవపట్నంలో ఓ మహిళను పరీక్షిస్తున్న గైనకాలజిస్టు

- జగనన్న సురక్ష క్యాంపుల్లో సేవలందిస్తున్న ప్రత్యేక వైద్యులు
- పేదలకు వైద్యంపై సంతృప్తి వ్యక్తం చేస్తున్న వైద్య నిపుణులు
- జిల్లా వ్యాప్తంగా క్యాంపుల్లో అందుబాటులో స్పెషలిస్టులు

భీమవరం (ప్రకాశం చౌక్): ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేస్తోంది. ప్రతి పల్లెలో, ప్రతి వార్డులో ప్రజల ఆరోగ్య అవసరాలపై సర్వే చేసి అనంతరం అవే ప్రాంతాల్లో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తోంది. అయితే ఈ క్యాంపుల్లో ప్రజలకు ప్రత్యేక వైద్య నిపుణులను అందుబాటులో ఉంచడం ద్వారా మెరుగైన వైద్య సేవలను అందిస్తోంది. గత నెల 30 తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు జరుగుతున్నాయి. ప్రతి క్యాంపులో ముగ్గురు నుంచి నలుగురు స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు ఆయా వ్యాధులకు సంబంధించి ఆరోగ్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందిస్తున్నారు. అయితే గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ వైద్య శిబిరాల్లో ఎక్కువ మంది స్పెషలిస్టు వైద్యులు వచ్చి సేవలు అందిస్తున్నారు. దీంతో అటు ప్రజల్లోనూ, ఇటు స్పెషలిస్టు వైద్యులు ఉత్సాహంగా ఉన్నారు.

సంతృప్తి వ్యక్తం చేస్తున్న వైద్యులు:

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలు అందించడంపై స్పెషలిస్టు వైద్యులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ వద్దకు వచ్చే కొంత మంది రోగులకు మాత్రమే వైద్య సేవలు అందించే తాము గత 25 రోజులుగా ప్రజల మధ్య ఉండి ఎక్కువ మందికి వైద్య సేవలు అందించడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కరోనా సమయంలో విస్తృత వైద్య సేవలు అందించే పరిస్థితి లేక కొందరు ప్రాణాలు రక్షించలేకపోయామనే బాధ ఉండేదని, కానీ నేడు పెద్ద సంఖ్యలో ప్రజలకు వైద్య సేవలు అందించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించడంతో వైద్య వృత్తికి పూర్తి న్యాయం చేస్తున్నామనే భావన కలుగుతోందని వైద్యులు అంటున్నారు.

అందుబాటులో 91 మంది స్పెషలిస్టు వైద్యులు

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో జిల్లా వ్యాప్తంగా 91 మంది స్పెషలిస్టు వైద్యులు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీలో 41 మంది, వైద్యవిధాన పరిషత్ నుంచి 40 మంది, ఐఎంఏ నుంచి 10 మంది స్పెషలిస్టు వైద్యులు సురక్ష క్యాంపుల్లో వైద్య సేవలు అందిస్తున్నారు.

జిల్లాలో స్పెషలిస్టు వైద్యుల వివరాలు

విభాగం	సంఖ్య
స్త్రీల వైద్యులు	19
ఎముకలు	18
జనరల్ మెడిసిన్	7
జనరల్ సర్జన్స్	13
పిల్లల వైద్యులు	14
ఈఎన్‌టీ	4
చర్మవ్యాధుల నిపుణులు	4
మానసిక వైద్యులు	3
మత్తు వైద్యులు	3
కంటి వైద్యులు	1
ఎమర్జెన్సీ మెడిసిన్	1
పల్మనాలజిస్టు	1
మైక్రో బయాలజీ	1
పేథాలజిస్ట్	1

సంతోషంగా ఉంది



పల్లెల్లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులకు వెళ్లి మహిళలకు వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉంది. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడంతో వృత్తికి పూర్తి న్యాయం చేసినట్లు అయింది. గర్భిణులు, పెద్ద వయస్సు మహిళలకు కూడా సేవలు అందించే అవకాశం ఈ క్యాంపుల ద్వారా లభించింది. నేను 10 క్యాంపులకు హాజరై వైద్య సేవలు అందించాను.

– డాక్టర్ .కె.సింధీ ఆనంద్, గైనకాలజిస్ట్

ఎంతో సంతృప్తిగా ఉంది



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడం ఎంతో సంతృప్తిగా ఉంది. ఇప్పటివరకు 12 క్యాంపులకు హాజరై ఎక్కువ మందికి వైద్య సేవలు అందించాను. ఈ అవకాశం ప్రభుత్వం మాకు కల్పించడం సంతోషంగా ఉంది. ఎముకలకు సంబంధించి పెద్ద వయస్సు వారికి వైద్య సేవలు అందించడంతో వారు మాపై చూపిన అభిమానం, ఆప్యాయత మార్చిపోలేనిది.

– డాక్టర్ శివశంకర్, ఆర్థోపెడిక్ వైద్యులు

ప్రజలకు సేవ చేసే అవకాశం



ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ప్రవేశపెట్టి ఈ క్యాంపుల ద్వారా ప్రజల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించే అవకాశం కల్పించింది. నిత్యం ఆస్పత్రిలో ఉండి వైద్య సేవలు అందించే మేము గ్రామాల్లోకి వచ్చి చిన్నా పెద్దా అందరికి వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉంది. ఇప్పటివరకు 6 క్యాంపులకు హాజరై వైద్య సేవలు అందించా.

– జి.సత్యనారాయణరాజు, జనరల్ మెడిసిన్

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మేరీ ప్రశాంతి



మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి, ఏఎస్పీ భాస్కరరావు, ఎస్ఈబీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: జిల్లాలో నేరాలను నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామని, నేరాలకు పాల్పడేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి చెప్పారు. నగరంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో బుధవారం నెలవారీ నేర సమీక్షా సమావేశం జరిగింది. సబ్ డివిజన్లు, సర్కిల్స్ వారీగా కేసుల నమోదు, దర్యాప్తు, నిందితుల అరెస్టులు, చార్జిషీట్ దాఖలు వంటి అంశాలపై అధికారులను ఆరా తీశారు. సమీక్షలో ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో నేరాలకు పాల్పడే వారిపై నిఘా మరింత పెంచాలన్నారు. మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడితే సత్వరమే స్పందిస్తూ నిందితులపై చర్యలు చేపట్టాలన్నారు. బాలికల మిస్సింగ్ కేసులపైనా ప్రత్యేక దృష్టి సారించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఆచూకీ తెలుసుకోవాలన్నారు. జిల్లాలో గంజాయి, మత్తుపదార్థాల రవాణా, విక్రయాలపై నిఘా పెంచాలన్నారు. రహదారి ప్రమాదాలను నివారించేందుకు జిల్లాలో బ్లాక్‌స్పాట్‌లు గుర్తించి, ప్రమాదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలని, సత్ప్రవర్తనతో మెలిగేలా వారిలో పరివర్తనకు కృషి చేయాలన్నారు. సివిల్ తగాదాల విషయంలో చట్టం మేరకు మాత్రమే పోలీసులు జోక్యం చేసుకోవాలని ఆదేశించారు. బాధితులతో మర్యాదగా వ్యవహరించాలని, పోలీస్ అధికారులు, సిబ్బంది అవినీతి, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నేర సమీక్షలో అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఎస్ఈబీ అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఎస్ఈబీ డీఎస్పీ రమేష్‌రెడ్డి, ఎస్బీ సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు, ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, డీటీసీ డీఎస్పీ కె.ప్రభాకరరావు, నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్, ఎస్సీ ఎస్టీ డీఎస్పీ ఉమామహేశ్వరరావు, డీసీఆర్‌బీ సీఐ దుర్గాప్రసాద్, ఏలూరు నగర సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

గడపగడపకు సంక్షేమం



లింగపాలెం: కలరాయునగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ వ్యక్తికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

మద్దిలో 14 నుంచి కార్తీక మాసోత్సవాలు



మద్దిలో కార్తీక మాస పందిరి రాట ముహూర్తం పూజలు నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలోని శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో నవంబర్ 14 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కార్తీక మాస మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. బుధవారం మద్ది క్షేత్రంలో కార్తీక మాస ఉత్సవాల రాటమూహూర్తం పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు రాటముహూర్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఆకుల కొండలరావు మాట్లాడుతూ కార్తీక మాసంలో నెల పాటు జరిగే ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుంటారని, భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెంకన్న సేవలో భవానీ భక్తులు



భవానీ దీక్షాధారులు, భక్తులతో నిండిన ఆలయ అనివేటి మండపం

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రం భవానీ దీక్షాధారులతో బుధవారం కిటకిటలాడింది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని విజయవాడ దుర్గ గుడిలో దీక్షలు విరమించిన భక్తులంతా ద్వారకాతిరుమల క్షేత్రానికి చేరుకుంటున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భవానీలు, సాధారణ భక్తులతో కిక్కిరిశాయి. దర్శనం క్యూలైన్లు, ఆలయ తూర్పు రాజగోపురం, అనివేటి మండపం, పరిసర ప్రాంతాలు భక్తులతో పోటెత్తాయి. రాత్రి వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

యువకుడి మృతి



ఏపూరి రాజేష్ మృతదేహం

వేలేరుపాడు: బైక్ అదుపుతప్పి ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ఏపూరి రాజేష్ (24) బైక్‌పై కన్నాగుట్ట గ్రామానికి వెళ్లి వేలేరుపాడు తిరిగి వస్తున్నాడు. బుర్రతోగు మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి తాటిచెట్టును ఢీకొంది. ఈ ఘటనలో రాజేష్ తలకు తీవ్ర గాయం కావడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే..

- ప్రియుడితో కలిసి భర్తను కడతేర్చిన భార్య
- వేగివాడ హత్య కేసులో భార్య, ప్రియుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్

ఏలూరు టౌన్: వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కట్టుకున్న భర్తను భార్య ప్రియుడితో కలిసి హత్య చేయించిందని నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ చెప్పారు. వేగివాడ హత్య కేసును కేవలం 24 గంటల్లో ఛేదించినట్లు తెలిపారు. ఏలూరులోని పెదవేగి సర్కిల్ కార్యాలయంలో బుధవారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. వేగివాడకు చెందిన నల్లిమెల్లి రమేష్, రిబ్కాకు 13 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. రిబ్కా ఆటోలో కూలి పనులకు వెళుతుండేది. ఈ క్రమంలో ఆటో డ్రైవరు కె.కన్నాపురానికి చెందిన కమ్మిలి శ్రీనివాసరావు అలియాస్ శ్రీనుతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న రిబ్కా భర్త రమేష్ వీరిని తీవ్రంగా హెచ్చరించాడు. దీంతో విబేధాలు తలెత్తి నాలుగేళ్ల క్రితం రిబ్కా పుట్టింటికి వెళ్లిపోయింది. మరోపక్క రిబ్కా, శ్రీను మధ్య వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఇదిలా ఉండగా పిల్లల కోసం రిబ్కా, రమేష్‌ను కలపాలని పెద్దలు భావించి రిబ్కాకు నచ్చజెప్పటంతో ఈనెల 15న కాపురానికి వచ్చింది. దీంతో తన పరిస్థితి ఏంటంటూ శ్రీను రిబ్కాను అడగడంతో రమేష్‌ను అడ్డు తొలగించుకుంటే ఇద్దరం కలిసి ఉండొచ్చని నిర్ణయించి అతని హత్యకు పథకం రచించారు. ఈనెల 24న రాత్రి శ్రీను ఆయిల్‌పామ్ గెలలు కోసే కత్తి తీసుకుని వేగివాడకు వచ్చాడు. రిబ్కా సహకారంతో రమేష్‌ను బయటకు పిలిచి కత్తితో విచక్షణా రహితంగా నరికాడు. అనంతరం శ్రీను పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న రమేష్‌ను స్థానికులు ఏలూరుకు, అక్కడ నుంచి విజయవాడ తీసుకువెళ్లగా అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బుధవారం జంగారెడ్డిగూడెం రూటులోని కొప్పులవారిగూడెం ఏడో మైలురాయి వద్ద నిందితులు శ్రీనును, రిబ్కాను నూజివీడు రూరల్ సీఐ బాల సురేష్‌బాబు, పెదవేగి ఎస్సై లక్ష్మణ్ అరెస్ట్ చేసి, వారి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

కోడిగుడ్డు వినియోగంపై అపోహలు వీడండి

బుట్టాయగూడెం: కోడిగుడ్డు తింటే జ్వరం వస్తుందనే అపోహలను ప్రజలు విడనాడాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న కోడిగుడ్డును తింటుంటే జ్వరం వస్తుందని అపోహ పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అపోహతో కోడిగుడ్లు తినేందుకు కొందరు నిరాకరిస్తున్నారని ఇది సరికాదని అన్నారు. కోడిగుడ్డు మంచి పౌష్టికాహారమని, దీని ద్వారా శరీరానికి అనేక పోషకాలు అందుతాయన్నారు. అలాగే ఆరోగ్యంతో పాటు ఆనందనాన్ని కూడా ఇస్తాయన్నారు. కోడిగుడ్లలో శరీరానికి కావాల్సిన శాచురేటెడ్ ఫ్యాట్స్, పాలీ అన్ శాచురేటెడ్ ఫ్యాట్స్, మోనో అన్ శాచురేటెడ్ ఫ్యాట్స్, పొటాషియం, విటమిన్ ఏ, డీ, బీ6, బీ12, కాల్షియం, ఐరన్, మెగ్నీషియమ్ వంటి కీలక పోషకాలు ఉంటాయని అన్నారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు కోడిగుడ్డును ఆహారంలో భాగం చేసుకోవడం ముఖ్యమైందన్నారు. కోడిగుడ్డు తింటే జ్వరం వస్తుందనే అపోహ నుంచి ప్రజలు బయటకు రావాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో అందిస్తున్న గుడ్లు తిని మహిళలు, పిల్లలు పోషకాహార లోపం నుంచి బయటపడాలని పీఓ సూర్యతేజ సూచించారు.

జగన్ పాలనలో రైతులకు పెద్దపీట

- ఎంపీ కోటగిరి శ్రీధర్
- గూటాల ఎత్తిపోతల పథకంలో ఎమ్మెల్యే బాలరాజుతో కలిసి మోటార్ ప్రారంభం



గూటాల ఎత్తిపోతల పథకంలో విద్యుత్ మోటార్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ కోటగిరి శ్రీధర్

పోలవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో రైతులకు పెద్దపీట వేశారని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. గూటాల ఎత్తిపోతల పథకంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్‌ను ఆయన ఎమ్మెల్యే తెల్లం బాలరాజుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. రాబోయే రోజుల్లో కూడా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరి భుజస్కంధాలపై ఉందన్నారు. రైతులు కూడా ఎత్తిపోతల నిర్వహణకు సహకరించి నీటి తీరువా పన్నులు కూడా సకాలంలో చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఎత్తిపోతల పథకం పరిస్థితిని ఎత్తిపోతల పథకం అధ్యక్షులు కరిబండి శ్రీను రైతులతో కలిసి తెలియజేయడం జరిగిందన్నారు. గతంలో ఎత్తిపోతల పథకం పరిశీలించి రూ.25 లక్షల నిధులు కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. దీంతో కొత్త మోటార్ ఏర్పాటుతో పాటు మరమ్మతులు చేపట్టి రైతులకు పుష్కలంగా నీరు అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మాట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో తోడ్పాటును అందిస్తున్నారన్నారు. రైతుకు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే కాక, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సకాలంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఎత్తిపోతల పథకం మరమ్మతులకు నిధులు మంజూరు చేసిన ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను రైతులు అభినందించడమే కాక, ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. సాగునీటి కాలువ పనులను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఐడీసీ ఈఈ ఎం.అనురాధ, ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు కలుం హేమకుమారి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, ఎత్తిపోతల పథకం అధ్యక్షులు కరిబండి శ్రీను, గూటాల సర్పంచ్ ఎస్.ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు కరిబండి నాగయ్య, మైగాపుల దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు హరిరామకృష్ణ, ఆకుల వరలక్ష్మి, కాశీ ధనలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు సుంకర అంజిబాబు, పాదం రాజబాబు, బండారు అప్పారావు అధిక సంఖ్యలో రైతులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలు కృష్ణా, శ్రీకాకుళం



శ్రీకాకుళం మహిళా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్



కృష్ణా పురుషుల జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్

నూజివీడు: దసరా సందర్భంగా నూజివీడులో గత మూడు రోజులుగా నిర్వహించిన 71వ రాష్ట్ర స్థాయి పురుషుల, మహిళల కబడ్డీ పోటీల్లో పురుషుల విభాగంలో కృష్ణా, మహిళల విజేతగా శ్రీకాకుళం జట్టు నిలిచాయి. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరిగిన ఈ పోటీలలో ప్రారంభం నుంచి ఉత్తమ ప్రతిభ చూపిన జట్లు ఫైనల్‌కు చేరాయి. మహిళల విభాగంలో శ్రీకాకుళం, విశాఖపట్నం జట్లు, పురుషుల విభాగంలో కృష్ణా, విజయనగరం జట్లు ఫైనల్‌కు చేరాయి. మహిళల ఫైనల్ మ్యాచ్ శ్రీకాకుళం, విశాఖపట్నం జట్ల మధ్య ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. ఆట ద్వితీయార్థం నుంచి శ్రీకాకుళం జట్టు ఆటగాళ్లు మెరుగైన ఆటతీరు ప్రదర్శించడంతో చివరకు 32-21స్కోర్‌తో విశాఖపట్నం జట్టుపై గెలుపొంది విజేతగా నిలిచింది.

స్కోరు సమంతో ఇరు జట్లకు 5 రైడ్స్

పురుషుల విభాగంలో కృష్ణా-విజయనగరం జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ప్రథమార్థం ముగిసేసరికి 16-16 స్కోర్‌తో ఇరు జట్లు సమంగా నిలిచాయి. ద్వితీయార్థం ఆట ముగిసేసరికి 22-22 స్కోర్‌తో ఇరు జట్లు సమంగా నిలవడంతో రెండు జట్లకి ఐదు రైడ్స్ అవకాశం ఇచ్చారు. దీనిలో ప్రతిభ కనబరిచడంతో కృష్ణా జట్టు 28-26 తేడాతో విజయనగరంపై గెలుపొందింది. మహిళల, పురుషుల జట్లకు నగదు బహుమతులు మొత్తం రూ.2 లక్షలను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అందించారు. నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని పిల్లలకు చిన్నతనం నుంచే ఆటలు, క్రీడలలో శిక్షణనిచ్చినట్లయితే వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో సైతం రాణిస్తారన్నారు. ఏపీ స్టేట్ కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, స్పోర్టింగ్ క్లబ్ సెక్రటరీ తిరుమలశెట్టి వెంకట కృష్ణారావు, ఫెస్టివల్ కమిటీ సెక్రటరీ, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు శీలం రాము, స్పోర్టింగ్ క్లబ్ కోశాధికారి కోటగిరి సతీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దాసరి సూర్యనారాయణ పాల్గొన్నారు.